క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కోస్గి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సొంత ఖర్చులతో పుస్తకాలు కొనుగోలుచేసి పంపిణీ చేసి విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం కృష్ణగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అదేపాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేసి అందజేశారు. ఇందులో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నర్వ: మిషన్‌భగీరథ పథకం పనులపై పంచాయతీ కార్మికులకు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ డీఈ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో నిర్వహించిన శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. ప్రతి మండల కేంద్రంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులకు నాలుగు రోజులపాటు ఈ శిక్షణను అందిస్తామన్నారు. ప్రధానంగా మోటర్ల పనితీరు, పైప్‌లైన్‌ల మరమ్మతు, నీటి సరఫరాలో వచ్చే అవంతరాలను తొలగించి స్వచ్ఛమైన నీటిని గ్రామీణ ప్రజలకు అందించాలనే అంశాలపై శిక్షణను అందిస్తున్నామన్నారు. ఈ శిక్షణను ఈ నెల 1, 3, 4, 5నాలుగు రోజులపాటు అందిస్తున్నామన్నారు. శిక్షణలో ఎంపీడీఓ శ్రీనువాసులు, జేటీఓ అశోక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

కృష్ణా: మండల ఎంఈఓగా నియమితులైన నిజాముద్దీన్‌కు మంగళవారం మండల కేంద్రంలోని అన్ని పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం



మక్తల్: పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ బీమా అధ్యక్షుడు డీవీచారి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ అనుగొండ శ్రీనివాసుల సహకారంతో 50మంది రోగులకు కంటి పరీక్షలుచేయగా అందులో 30మందికి కంటి సమస్యఉన్న వారికి ఆపరేషన్‌కోసం ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. కంటి పరీక్షలు చేసిన వారికి ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డీవీ చారి, అంజన్‌ప్రసాద్, పృథ్వీరాజ్, ప్రమోద్, శ్రీనివాసులు, కట్టవెంకటేష్, అంబాదాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం



నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వారి ఇంట్లోని వృద్ధులను స్కూల్‌కి ఆహ్వానించి వారికి పాదపూజ చేసి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం వేణుగోపాల్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పెద్దల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు

మరికల్: రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలిచిన 65మంది ఎమ్మెల్యేల్లో ఒక ఎమ్మెల్యే కూడా విద్యాశాఖకు అర్హత లేదా ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని గుర్తు చేశారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించి విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న బైపీసీ విద్యార్థిని రజిత రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక కావడంతో మంగళవారం అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్, కోచ్ శ్రీనివాస్ అధ్యాపకులు పాల్గొన్నారు.





మక్తల్‌లో..



కృష్ణాలో



మరికల్‌లో బతుకమ్మలతో విద్యార్థులు

పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: నారాయణపేట మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యాశాఖ దసరా సెలవులు ప్రకటించడంతో రెండు రోజుల ముందుగానే పిల్లలు పాఠశాలల్లో బతుకమ్మ పండుగ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మేరకు.. కొలాటాలు, దాండియా ఆటలతో బతుకమ్మ పాటలతో చిన్నారులతో కలిసి ఉపాధ్యాయులు చిందేశారు. అనంతరం శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్, టీచర్స్, విద్యార్థులు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేట మండలం జాజాపూర్‌లో బతుకమ్మతో చిన్నారులు

● మద్దూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి నృత్యాలు చేశారు. నిడ్జింత ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడారు.. ప్రకృతిని ప్రేమించే పండుగ బతుకమ్మ అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మరికల్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించుకున్నారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కృష్ణా మండల కేంద్రంలోని గుడెబల్లూర్‌లో ఉన్నత పాఠశాల, కున్సి ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మాగనూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. ఈమేరకు..హెచ్ఎం రాజిరెడ్డి మాట్లాడారు.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని తెలిపారు. ఉపాధ్యాయులు అనిత, విశాలక్ష్మి, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

● మక్తల్ మండలంలోని కాచ్‌వార్‌లో ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. అనంతరం గ్రామాల్లోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

● దామరగిద్దమండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జీఎచ్ఎం అన్నపూర్ణ సమక్షంలో విద్యార్థులు బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులు బంతి, తంగేడు, గును గు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ నేపథ్యంలో మంగళవారం కోస్గి మండల పరిధిలోని పాఠశాలలో విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మీర్జాపూర్, ముశ్రీఫా, నాచారంతోపాటు పలు పాఠశాలలో విద్యార్థుల బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. వేడుకల అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో



మాగనూర్‌లో



దామరగిద్దలో..



ముశ్రీఫా పాఠశాలలో

సమాజానికి గురువులే మార్గదర్శకులు



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: సమాజానికి గురువులే మార్గదర్శకులని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే వారికి సన్మానించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల దేనన్నారు. విద్యతోపాటు సమాజంలో జరిగే మంచి, చెడులపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, అనిల్‌గౌడ్, నిజముద్దీన్, జనార్దన్‌రెడ్డి, గణేష్‌కుమార్ ఎల్లప్ప, బాల్‌రాజు, శ్రీనివాసులు, వెంకట్‌రాములు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

ఆత్మకూర్: మండలంలోని మిషన్ భగీరథ పథకం ద్వా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పంచాయితీ కార్మికులు ముందుకెళ్లాలని మిషన్‌భగీరథ డీఈ రామసుబ్బారావ్, ఏఈ రుక్మేందర్‌రెడ్డి, ఎంపీడీఓలు సుజాత, శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల పరిధిలోని కార్మికులకు నీటిసరఫరాపై అవగాహన కల్పించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నర్వ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని విశ్రాంత పీఈటీ, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం అన్నారు. మంగళవారం పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో 20మంది క్రీడాకారులకు రూ. 6వేల విలువ చేసే క్రీడా దుస్తులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే 2శాతం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ మీదేనన్నారు. అనంతరం గోపాలంను ఉపాధ్యాయులు సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య, పీడీ విష్ణువర్ధన్, వెంకటేష్ శెట్టి, సదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా దుస్తులను అందిస్తున్న గోపాలం

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట: మహిళలు, విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్‌లో షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనలో షీ టీం పోలీసుఅధికారి బాలరాజు మాట్లాడారు. బాల్య వివాహాలు, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ చట్టాలు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజు స్కూలు, కళాశాలకు వచ్చే విద్యార్థులు, మహిళలు టీ సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రయాణం చేసే సమయంలో తప్పక ఉపయోగించుకోవాలన్నారు. మహిళలకు ఎవరైనా వేధింపులకు గురిచేసిన సెల్ నంబర్8712670 398కి లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు చెన్న య్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్

ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసుశాఖ సిబ్బంది జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఉల్లంఘన, రోడ్డు భద్రత నియమాలు పాటించని వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 21 వాహనాలు పట్టుకున్నారు. హెల్మెట్, మైనర్ డ్రైవింగ్ చేసే 21వాహనాలను పట్టుకుని ఆర్టీఓకు రాసి పంపియడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఎస్ఐ గాయత్రి, ఏఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

గుండుమాల్‌కు జూనియర్ కళాశాల మంజూరు

కోస్గి: నూతనంగా ఏర్పడిన గుండుమాల్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. గతనెలలో పూర్వ కోస్గి మండల పరిధిలోని హకీంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువరించిన వారం రోజుల్లోనే గుండుమాల్ మండలానికి మరో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం



మరికల్: ఉద్యోగంలో ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫోర్‌మేన్ గ్రేడ్–1 ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తు పదవీ వరమణ పొందిన శ్రీనివాసులును మంగళవారం సన్మానసభలో ఆయనను మండలంలోని కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, ఏఈ రవికాంత్, మహేష్‌గౌడ్, గోవింద్, వెంకటేష్, కృష్ణయ్య, శ్రీనివాసులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా కార్యదర్శి ఎన్నిక

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామానికి చెందిన వాకిటి బీమశంకర్ జిల్లా బీసీ సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మంగళవారం బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మండల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రోగులకు పండ్ల పంపిణీ

ఊట్కూరు: మండలంలోని దివంగత మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి జయంతిని మంగళవారం ఆయన స్వ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్కోటి నారాయణరెడ్డి, లయన్స్‌క్లబ్ ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, మాజీ మక్తల్ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు అరవింద్‌కుమార్, చంద్రకాంత్‌గౌడ్, బాల్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, వంశీ, నచికేతారెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శరన్నవ రాత్రి ఉత్సవాలకు ముస్తాబు



సరాఫ్‌బజార్‌లో అమ్మవారి మండప ఏర్పాట్లు



చౌక్ సెంటర్‌లో విద్యుత్‌దీప అలంకరణలు

నారాయణపేట రూరల్ : ఎంతో వైభవంగా వినాయక ఉత్సవాలను ముగింపుచుకున్న పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాలను సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్‌దీప అలంకరణలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఏర్పాటుకు మండపాల తయారి పూర్తి చేశారు.

రోజుకో అలంకరణలో అమ్మవారు...

పట్టణంలోని ఆయా మహంకాళి ఆలయాలో వెలిసిన అమ్మవారికి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణచేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వివిధ రకాలైన పలహారం, నైవేద్యం సమర్పిస్తారు.

పెరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన మండపాలు

పట్టణంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలకు గతంలో సరాఫ్‌బజార్‌లో బంగారు వ్యాపారస్తులు, మార్వడి సంఘం, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కేవలం ఒకటి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసేవారు. 13సంవత్సరాలుగా శివాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్నారు. అయితే క్రమంగా ఈ సంఖ్య పెరుగుతూ ఈ సారి మరో 10చోట్ల అమ్మవారి భక్తులు విగ్రహ ఏర్పాట్లు చేస్తున్నారు.

తొమ్మిది రోజులు పూజలు:

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారి విగ్రహాలను పట్టణ పుర వీధుల గుండా భారీ డోలు వాయిద్యాలు, డీజే పాటలతో నృత్యాలు, భజనలు చేస్తు ఊరేగింపుగా మండపాలకు తరలిస్తారు. తొమ్మిదిరోజులపాటు రాత్రి వేళలో పెద్ద ఎత్తున భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ నెల 13న భారీ శోభాయాత్ర ద్వారా అమ్మవారి ప్రతిమలను పట్టణ శివారులోని కొండారెడ్డిపల్లి చెరువులో జలప్రవేశం చేయిస్తారు.

పుట్టపర్తికి తరలిన సాయిభక్తులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం నుంచి పలువురు సత్యసాయి భక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టపర్తికి ప్రత్యేక వాహనాల్లో మంగళవారం సాయంత్రం తరలి వెళ్లారు. పాలమూరు, నారాయణపేట జిల్లా భక్తులకు రెండురోజులపాటు సాయి కుల్వంత్‌హాల్‌లో ప్రత్యేక ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాబా మహిమలు, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గోపీనాథ్‌రావు, మల్లికార్జున్, చిట్టెం మాధవరెడ్డి, శివరాజ్, బీఎంఎస్‌రెడ్డి పాల్గొన్నారు.



పుట్టపర్తికి బయలుదేరుతున్న భక్తులు

గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

మాగనూర్: మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు శివరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అడవిసత్యారంలో లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించి ఆరు గ్యారంటీలలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 500 గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలిపారు. మండలంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ ఈ పథకం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు, గ్రామస్తులు చాకలి మొగ్గలప్ప, ప్రియతమరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఒకే వ్యక్తికి రెండు ఉద్యోగాలు

మద్దూరు: మండలంలోని దోరేపల్లికి చెందిన కృష్ణవేణికి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీలో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్‌లో జిల్లాలో 10వ ర్యాంకు సాధించారు. ఈమె సెర్ప్ సంస్థలో వికలాంగులకు కోసం పార్ట్‌టైం జాబ్ చేస్తూ డీఎస్సీకి ప్రిపేర్ అయినట్లు తెలిపారు. ఇంటర్ వరకు కోస్గిలో ప్రజ్ఞ కాలేజీ చదివి, డిగ్రీ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో, అలాగే బీఈడీ కూడా ఓపెన్ యూనివర్సిటీలోనే పూర్తి చేశారు. భర్త నరేష్, కృష్ణవేణి గతకొంత కాలంలో మహబూబ్‌నగర్‌లో ఉంటూ డీఎస్సీ కోసం చదివారు.



కృష్ణవేణి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

మక్తల్: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రతి నియోజకవర్గంలో జ్యోతిరావు పూలే బీసీ భవనం, 3 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కులగణన చేపట్టాలని, 2024 స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రంగప్పయాదవ్, రాజు, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఇద్దరు ఆణిముత్యాలు

ఊట్కూరు: మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లను సాధించారు. బసవరాజు, భారతి కుమారుడు సాయితేజ్ 539మార్కులు సాధించి జనగామ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు ఎంపికైంది. అలాగే కొల్ల రాజేశ్వర్ లావన్య కుమార్తె భవ్యశ్రీ 630మార్కులు సాధించి వరంగల్ మెడికల్ కళాశాలలో ఎంపికైంది. ఎంబీబీఎస్ సీట్లు సాధించడంపై మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు సూర్యప్రకాష్‌రెడ్డి, ఎల్కోటినారాయణరెడ్డి, భాస్కర్ తదితరులు విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతతోనే రోగాలు దూరం

ఆత్మకూర్: ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా, పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీరు ఉంచొద్దు

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండొచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

అమరచింత: పల్లె బృహత్‌ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ సమీపంలో ఏర్పాటు చేసిన వన సంపద వనాలను ఆయన మంగళవారం సందర్శించి, మొక్కలకు నీరు పట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలతో పాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందిచాలన్నారు. మొక్కల పెంపకంపై అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు